మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

● ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
● ఆత్మకూరులో వైఎస్సార్ ఆసరా సంబరాలు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా, పొదుపు మహిళలు

ఆత్మకూరు: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో శనివారం వైఎస్సార్ ఆసరా సంబరాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పొదుపు మహిళలకు ఆసరా మెగా చెక్కును అందజేశారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో పొదుపు మహిళ రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక నేరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరు పట్టణంలో 419 పొదుపు గ్రూపులకు గాను రూ.1.84కోట్లు, ఆత్మకూరు మండలంలో 575 గ్రూపులకు రూ.2,74,21,849 మంజూరు అయ్యాయని చెప్పారు. పొదుపు మహిళలకు ఇచ్చిన హామీ అమలు చేయడమే కాకుండా నవరత్నాలు పథకం ద్వారా అమ్మ ఒడి, విద్యాదీవేనతో పాటు కార్పొరేట్‌స్థాయిలో విద్యానందిస్తూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, 45 సంవత్సరాలు నిండిన మహిళలకు చేయూత పథకం ద్వారా రూ.18,000 మంజూరు చేస్తూ అన్ని పథకాల్లో మహిళలకు పెద్దపీట వేశారని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పొదుపు మహిళలకు రుణాలు మాఫీ, బంగారు రుణాలు మాఫీ చేస్తానని హామీ ఇచ్చి ఎన్నికల్లో గెలిచాక మోసగించారని గుర్తుచేశారు.

ఆత్మకూరు మండలాని రూ.4,58,21,849

ఒక్క ఆత్మకూరు మండలానికే (పట్టణంతో కలిపి) రూ.4,58,21,849లు వైఎస్సార్ ఆసరా కింద పొదుపు రుణాలు మాఫీచేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కిందన్నారు. అంతకుమునుపు, పొదుపు మహిళలు ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డిని దుశ్శాలువలు, ఘజమాలతో సన్మానించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శిల్పా భువనేశ్వరరెడ్డి, పీడీ శ్రీధర్‌రెడ్డి, పుల్లయ్య, ఉమాదేవి, పార్వతి, రాజగోపాల్, షేహీవున్నీసా, నాగలక్ష్మి, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్లు, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

పట్టణంలోని కట్టెల రఫీ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ కింద విడుదలైన రూ.3లక్షల చెక్కును అందజేశారు. అనంతరం ఇందిరేశ్వరం గ్రామానికి చెందిన సేవాలాల్ మహారాజ్, మారెమ్మ తల్లి గుడి నిర్మాణానికి రూ.50 వేలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఇందిరేశ్వరం సర్పంచు నారాయణరెడ్డి, రాజమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం సభను విజయవంతం చేయండి

వంచనకు, విశ్వసనీయతకు మధ్య జరుగుతున్న యుద్ధ సంగ్రామానికి సిద్ధం అవుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి కార్యకర్త సంఘీభావం తెలపాలని ఎమ్మెల్యే శిల్పా పిలుపునిచ్చారు. ఈనెల 10వ తేదీన అనంతపురంలో నిర్వహిస్తున్న సిద్ధం కార్యక్రమాన్ని విజయవంతం చేయా లని కోరారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పెద్ద ఎత్తున ముఖ్యమంత్రి నిర్వహిస్తున్న ఈ బహిరంగ సభకు నియోజవర్గం నుంచి భారీగా కార్యకర్తలు, అభిమానులు, నాయకులు తరలిరావాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి దుర్మార్గంగా చిల్లర మాటలు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ ప్రజలందరూ, మహిళలు ప్రతి ఒక్కరూ తమవెంటే ఉన్నారని వచ్చే ఎన్నికలలో 50 వేల ఓట్లకు పైగా భారీ మెజార్టీతో విజయం సాధించడం తథ్యమన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. మండలంలోని వడ్లరామాపురం గ్రామంలో ఆర్‌బీకే కేంద్రాన్ని ఎమ్మెల్యే, తనయుడు శిల్పా కార్తీక్‌రెడ్డి, సోదరుడు శిల్పా భువనేశ్వర రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ముస్లిం శ్మశాన వాటికకు రూ.18 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభించారు. అనంతరం వడ్లరామాపురం, కొట్టాలచెరువు గ్రామాలకు రూ.7 కోట్లతో బీటీ రోడ్డుకు భూమిపూజ చేశారు.



హాజరైన పొదుపు సంఘాల మహిళలు



సమరానికి సిద్ధం అంటున్న ఎమ్మెల్యే, నాయకులు

ముష్టపల్లిలో హెల్త్ సెంటర్ ప్రారంభం

ముష్టపల్లి గ్రామంలో హెల్త్‌క్లినిక్‌ను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ప్రారంభించారు. ముష్టపల్లి, పెద్ద అనంతపురం గ్రామాలకు రూ.2.10కోట్లతో నిర్మిస్తున్న బీటీరోడ్లకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ బాలస్వామి యాదవ్, మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి, సర్పంచు లక్ష్మీదేవి, ఎంపీటీసీ బాల వెంకటస్వామి, ఏడీఏ ఆంజనేయులు, సర్పంచులు నారాయణరెడ్డి, శివశంకర్ నాయక్, రవినాయక్, జయన్న, కౌన్సిలర్లు కోట్ల నాగేశ్వర్‌రెడ్డి, విజయ్‌చౌదరి, సుల్తాన్, పువ్వాడ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సిద్ధపల్లె గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. శనివారం రాత్రి పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వారికి కండువా వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన ఈశ్వరయ్య, శ్రీనివాసులు, నాగరాజు, మధు, కాశమ్మ, ధనలక్ష్మి, దరగయ్య, యేసు, సుందరరాజు, నాగేశులు, స్వామన్న, రమేష్, పుల్లమ్మ, రత్నమ్మతో పాటు 20 కుటుంబాల సభ్యులు సర్పంచ్ ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మురళీధర్ రెడ్డి, హనుమంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీని వీడి ఎమ్మెల్యే శిల్పా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన సిద్ధపల్లె గ్రామస్తులు

క్లుప్తంగా

మండల అభివృద్ధికి కృషి



విజయరావు

మహానంది: అందరి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని బండిఆత్మకూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి విజయరావు అన్నారు. బదిలీపై వచ్చిన ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన వాసుదేవ గుప్తా వైయస్సార్ జిల్లాకు బదిలీ అయిన విషయం తెలిసిందే. బదిలీ అయిన ఎంపీడీఓ వాసుదేవగుప్తను కార్యాలయం సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

బాధ్యతల స్వీకరణ



సరస్వతి


పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓగా సరస్వతి శనివారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా పరిగి మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చినట్లు ఆమె తెలిపారు.

మిడుతూరు ఎంపీడీఓగా గంగావతి



మిడుతూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓగా గంగావతి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈమె అనంతపురం జిల్లా చెనప్ప కొత్తపల్లి మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ జీఎస్ఎస్‌రెడ్డి అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్లారు.

నిప్పుల వాగుకు 650 క్యూసెక్కుల నీటి విడుదల



నిప్పుల వాగుకు విడుదలవుతున్న కృష్ణా జలాలు

పాములపాడు: మండలంలోని కేసీ కెనాల్ 120వ కిలో మీటరు లాకీన్స్‌లా నుంచి శనివారం 650 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి కేసీ కెనాల్‌లోకి 735 క్యూసెక్కుల కృష్ణాజలాలను విడుదల అవుతున్నాయన్నారు. కాగా లాకీన్స్‌లాకు చేరిన నీటినంతా నిప్పుల వాగుకు మా త్రమే విడుదల చేస్తున్నామని, అలగనూరు రిజార్వాయర్, తూడిచెర్ల సబ్ ఛానల్ లకు నీటి విడుదల నిలిపి వేయడం జరిగిందని వివరించారు.

ఈఓను కలసిన తెలుగు వర్సిటీ సిబ్బంది



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీశైలం: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం చరిత్ర, సంస్కృతి, పురావస్తు శాస్త్ర పీఠం శ్రీశైలం ప్రాంగణ పీఠాధిపతి డాక్టర్ ముసుగు శ్రీనివాసరావు, ప్రాంగణ సిబ్బంది శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజును శనివారం రోజు మర్యాదపూర్వకంగా కలిశారు. అదేవిధంగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం క్యాలెండర్‌ను కార్యనిర్వాహణాధికారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు శోభన్ బాబు, విశ్వనాథ శాస్త్రి, లైబ్రేరియన్ మురళీధర్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సి.రమేష్ బాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.

మహానందిలో ఎస్‌కే యూనివర్సిటీ వీసీ



వేదాశీర్వచనం అందుకుంటున్న వీసీ

మహానంది: మహానందీశ్వర స్వామి సన్నిధిలో ఎస్‌కే యూనివర్సిటీ వీసీ హుసేన్ రెడ్డి శనివారం పూజలు నిర్వహించారు. ఆలయ ఏఈఓ వై.మధు, పండితులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ మేరకు వారు శ్రీ మహానందీశ్వర స్వామివారికి అభిషేకం, శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు. పూజల అనంతరం అలంకార మండపంలో వేద పండితులు వారికి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

నందికొట్కూరు రూరల్ : ప్రభుత్వం ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని మండల సీఐటీయూ ఉపాధ్యక్షుడు భాస్కరరెడ్డి కోరారు. ఈనెల 8న ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని విజయవాడలో నిర్వహించే ధర్నాకు హాజరయ్యేందుకు అనుమతివ్వాలని బ్రాహ్మణకొట్కూరు పీహెచ్‌సీ సెంటర్‌లో పనిచేసే ఆశావర్కర్లు వైద్యుడు మనోజ్‌కుమార్‌కు శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆశావర్కర్లకు కనీస వేతనాలు చెల్లించి పని భారం తగ్గించాలని అన్నారు. కార్యక్రమంలో ఉమాభారతి, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌ను కలసిన మహానంది ఈఓ



కలెక్టర్ శ్రీనివాసులకు ప్రసాదాలు ఇస్తున్న ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి

మహానంది: నంద్యాల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న కలెక్టర్ శ్రీనివాసులును మహానంది ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు కలెక్టర్ శ్రీనివాసులు మహానంది ఆలయ విశిష్టత, అభివృద్ధి పనులు, మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా చేపడుతున్న పనులు, ఏర్పాట్లపై ఈఓను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేసీ రాహుల్‌కుమార్ రెడ్డిని ఈఓ కలసి మహానంది దేవస్థానం భూముల పరిరక్షణ, విస్తీర్ణం, వివరాల సేకరణకు ఒక సర్వేయర్‌ను కేటాయించాలని కోరారు. స్పందించిన జాయింట్ కలెక్టర్ సర్వేయర్‌ను అందుబాటులో ఉంచుతామని హామీ ఇచ్చారు. వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మలు కలెక్టర్, జేసీలకు మహానందీశ్వరుని ప్రసాదం అందించి వేదాశీర్వచనం చేశారు.

సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థి ప్రతిభ

కొత్తపల్లి: మండలంలోని దుద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి ఎస్.గంగాధర్ రెడ్డి విజయవాడలో జరిగిన సదరన్ ఇండియా సైన్స్ ఫేయిర్‌లో ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం టి.మంగన్న, ఉపాధ్యాయుడు కృష్ణమోహన్ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థిని శనివారం పాఠశాలలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. వారు మాట్లాడుతూ.. జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో ఈ సైన్స్‌ఫెయిర్‌కి ఎంపికై పాల్గొన్నాడన్నారు. జనవరి 27 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ టెక్నాలజికల్ మ్యూజియం బెంగళూరు, ఎస్‌సీఈఆర్టీ ఆంధ్రప్రదేశ్ వారు సంయుక్తంగా నిర్వహించిన ఈ ప్రదర్శనలో 16 రాష్ట్రాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. ఇందులో తమ విద్యార్థి గంగాధర్‌రెడ్డి వ్యక్తిగత విభాగంలో ఆటోమెటిక్ సోలార్ ట్రాకర్ పనితీరుపై ఉత్తమ ప్రదర్శన ఇవ్వడం జరిగిందన్నారు. అందుకుగాను కేఆర్ఈడీఎల్ (కర్ణాటక రెనేవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ లిమిటెడ్) ప్రత్యేక సర్టిఫికెట్ ఇచ్చి అభినందించారన్నారు. ఇలాంటి కొత్త ప్రయోగాల ద్వారా విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయడంతోపాటు మంచి గుర్తింపు కూడా లభిస్తుందన్నారు.



కేఆర్ఈడీఎల్ సర్టిఫికెట్‌తో విద్యార్థి గంగాధర్ రెడ్డి, టీచర్ కృష్ణమోహన్

వారంలోగా తూడిచెర్ల రోడ్డు పూర్తి



రోడ్డు నిర్మాణ పనులను తనిఖీ చేస్తున్న డీఈ లక్ష్మీనారాయణ

జూపాడుబంగ్లా: వారంలోగా పారుమంచాల - మద్దూరు రోడ్డు నిర్మాణం పనులు పూర్తిచేస్తామని పీఐయూ డీఈ లక్ష్మీనారాయణ తెలిపారు. పారుమంచాల-తూడిచెర్ల మీదుగా మద్దూరు వరకు పది కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డును టీడీపీ పాలనలో బాగుచేసిన దాఖలాల్లేవు. దీంతో ప్రయాణికులు, ప్రజలు ఆదారిన వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. విషయాన్ని టీటీడీ ఈఓ ధర్మారెడ్డి సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో ఆర్ఆర్ఆర్ ప్లాన్స్ కింద రూ.4.8కోట్ల నిధులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేశారు. రోడ్డు నిర్మాణం పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ వేగంగా రోడ్డు నిర్మాణం పనులు చేపడుతుండటంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డీఈ మాట్లాడుతూ మరో వారంరోజుల్లోగా రోడ్డు నిర్మాణం పనులు పూర్తిచేసి ప్రయాణికులు సవ్యంగా, హాయిగా రోడ్డువెంట ప్రయాణించి గమ్యస్థానాలకు చేరుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు.

పార్కు నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

నందికొట్కూరు: పట్టణంలోని ఏబీఎం పాలెంలో చేపట్టిన నూతన పార్కు నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి ఆదేశించారు. శనివారం పట్టణంలో పార్కు నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కుడా నిధులు రూ.45 లక్షలతో పార్కును నిర్మిస్తున్నామన్నారు. పట్టణంలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్న సాయంతో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి రూ.16 కోట్ల నిధులను మంజూరు చేయించి సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలను పూర్తి చేస్తునట్లు తెలిపారు. సీఎం జగనన్న పాలనలో పట్టణ రూపురేఖలు మారాయని చెప్పారు. ఆయన వెంట కౌన్సిలరు చిన్నరాజు, వైఎస్సార్ సీపీ నాయ కులు రాజు, సీఎస్ఐ సంఘ పెద్దలు పాల్గొన్నారు.



పార్కు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా

కొత్తపల్లి: మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆత్మకూరు రూరల్ సీఐ నాగభూషణ్ సూచించారు. శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. అదేవిధంగా సిబ్బందితో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సీఐ మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఏఏ గ్రామాలలో ఘర్షణలు జరిగాయో సమాచారం సేకరించాలన్నారు. గ్రామాలలో బెల్టు షాపులు, నాటుసారా విక్రయాలపై దృష్టి సారించాలన్నారు. ఇప్పటికే పెద్దగుమ్మడాపురం, ముసలిమడుగు, నందికుంట గ్రామాలలో పలువురిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపించామని చెప్పారు. సంగమేశ్వరం -సోమశిల గ్రామాల మధ్య కృష్ణానదిలో మరబోట్లు అనుమతులు లేకుండా తిరుగుతున్నట్లు సమాచారం ఉందన్నారు. మరబోట్లను తిప్పితే సీజ్‌చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న సీఐ నాగభూషణ్

దేశెట్టికి డాక్టరేట్



ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్ ప్రతినిధులతో దేశెట్టి

నందికొట్కూరు: పట్టణంలో 20 ఏళ్ల నుంచి సోషల్ సర్వీస్, 20 సార్లు రక్తదానం చేసిన దేశెట్టి శ్రీనివాసులు (ఆర్ట్ శ్రీను)కు శనివారం ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్ జర్మనీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. తమిళనాడు రాష్ట్రంలోని ఇంటర్నేషనల్ పీస్ కౌన్సిల్ జర్మనీ సంస్థకు 3 నెలల క్రితం 20 ఏళ్ల సోషల్ సర్వీస్ గురించి, గీచిన చిత్రాలు, జాతీయ, సాధించిన రాష్ట్ర స్థాయి 40 అవార్డుల గురించి పంపారు. దీంతో ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

13న రాష్ట్రస్థాయి వృషభాల బలప్రదర్శన

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని లింగాపురం గ్రామంలో ఉన్న పరిశుద్ధ త్రిత్వపు ఆలయ 3వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 13న రాష్ట్ర స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వృషభాలకు మొదటి బహుమతి రూ. 50వేలు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అందజేస్తారని చెప్పారు. రెండో బహుమతి రూ. 35వేలు, మూడో బహుమతి రూ. 25వేలు, నాలుగో బహుమతి రూ.15వేలు, ఐదో బహుమతి రూ.10వేలు, ఆరో బహుమతి రూ.5వేలు అందజేస్తామన్నారు. మొదటి బహుమతి మినహా మిగిలిన అన్ని బహుమతులకు మండల నాయకులు సహకరించారని కోరారు. అలాగే 14వ తేదీన మండల స్థాయి ట్రాక్టర్ రివర్స్ పందెం ఉంటుందని నిర్వాహకులు వివరించారు.

కొలతల ప్రకారం పనులు చేయండి

కొత్తపల్లి: కొలతల ప్రకారం పనులు చేయడం వల్ల మంచి వేతనం వస్తుందని ఏపీఓ రేష్మ అన్నారు. శనివారం మండల పరిధిలోని ముసలిమడుగు గ్రామశివారుల్లో కుంటలో పూడిక తీత పనులను ఆమె తనిఖీ చేశారు. ఉపాధికూలీల మస్టర్లను పరిశీలించారు. పనికి రాకుండా హాజరు వేసుకోకూడదని హెచ్చరించారు. అదేవిధంగా రోజువారి కనీస వేతనం రూ.272 వడేవిధంగా కొలతలు ఇవ్వాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. అనంతరం మునగ సాగును పరిశీలించారు. ఉపాధి హామీపథకం కింద పండ్ల తోటలు, మునగ తోటలను నాటుకునే రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హార్టీకల్చర్ ద్వారా పంటల సాగుచేస్తే ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. టెక్నికల్ అసిస్టెంట్ ఓబులమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ దేవదాస్ తదితరులు ఉన్నారు.

విధుల్లో చేరిన జూనియర్ అసిస్టెంట్

పగిడ్యాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా షమీల విధుల్లో చేరారని డిప్యూటీ తహసీల్దార్ రవి శనివారం తెలిపారు. నందికొట్కూరు మండలం బిజినివేముల సచివాలయంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించే ఈమె 2021లో నిర్వహించిన గ్రూప్- 4 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. గ్రూప్-4కు ఎంపికైన షమీల రెవెన్యూ శాఖలోకి జూనియర్ అసిస్టెంట్‌గా కర్నూలు జిల్లా కలెక్టర్ పోస్టింగ్ ఇచ్చారని చెప్పారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఆమె ఉదయం విధులకు హాజరయ్యారని డిప్యూటీ తహసీల్దార్ స్పష్టం చేశారు.

అవి-ఇవి

97.47 శాతం పింఛన్ల పంపిణీ

నందికొట్కూరు: సామాజిక పింఛన్లు మూడు రోజులకే 97.47 శాతం పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కిషోర్ తెలిపారు. శనివారం పట్టణంలో పింఛన్లు పంపిణీని పరిశీలించారు. పట్టణంలో 5,062 పింఛన్లకు గాను 4,934 మందికి వలంటీర్లు పంపిణీ చేశారన్నారు. మిగతా వారికి ఆదివారం పంపిణీ చేసి వంద శాతం పూర్తి చేస్తామని చెప్పారు.

కర్నూలు వెళ్లి పింఛన్ అందజేత

వెలుగోడు: మండలంలోని రేగడగూడురు గ్రామానికి చెందిన జయన్న కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకొని చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామ వెల్ఫేర్ అసిస్టెంట్ రాజ్ నాయక్ ఆసుపత్రికి వెళ్లి పింఛన్ సొమ్ము అందించారు. దీంతో జయన్న కుటుంబ సభ్యులు సీఎం వైఎస్ జగన్‌కు, సచివాలయ అధికారికి కృతజ్ఞతలు తెలిపారు.

ధర్మకర్తల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

మిడుతూరు: స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ ధర్మకర్తల మండలి ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ అయినట్లు ఈఓ గుర్రెడ్డి శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లా దేవదాయ శాఖ అధికారి ఆదేశాల మేరకు స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ధర్మకర్తల మండలి ఏర్పాటు విషయమై నోటిఫికేషన్ విడుదల అయినట్లు తెలిపారు. ఆసక్తి కల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు జిల్లా దేవదాయ శాఖ, రైతునగరం నంద్యాల వారికి తమ దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయని తెలిపారు. వివరాలకు ఆలయ ఈఓ గుర్రెడ్డి 9603528537 సంప్రదించాలన్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి



రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ విజయ్, డిప్యూటీ తహసీల్దార్ రవి

పగిడ్యాల: నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా జగనన్న లే అవుట్ కాలనీలో ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని డిప్యూటీ తహసీల్దార్ రవి కోరారు. శనివారం స్థానిక గ్రామ సచివాలయం- 1 లోని రిజిస్ట్రేషన్ కౌంటర్‌ను నందికొట్కూరు ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ విజయ్‌తో కలసి పరిశీలించారు. గత నెల 27 నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభంకాగా సాంకేతిక కారణాల వల్ల కొంత జాప్యం అవుతోందని, సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఆయన వెల్లడించారు. ఈనెల 9వ తేదీలోగా రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని కలెక్టర్ ఆదేశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈఓఆర్డీ నాగేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి, వీఆర్వో నాగన్న, డిజిటల్ అసిస్టెంట్ అశోక్ తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లోని 11 గ్రామ సచివాలయాల్లో జగనన్న ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతున్నట్లు ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా 11లేఅవుట్లలో 1,432 మందికి ఇళ్లస్థలాలు కేటాయించగా వారిలో ఇప్పటిదాకా 35 మందికి రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరింత వేగవంతం చేసి మిగిలిన వారి ఇళ్లస్థలాలు రిజిస్ట్రేషన్ చేసి పట్టా కాగితాలు అందజేస్తామన్నారు.

కురుకుందలో డీఎస్పీ పల్లెనిద్ర



కురుకుందలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఆత్మకూరు: మండలంలోని కురుకుంద గ్రామంలో శనివారం రాత్రి డీఎస్పీ శ్రీనివాసరావు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో కలిసిమెలిసి జీవించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల సందర్భంగా వివిధ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఓటర్లను ప్రభావితం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు కోట్ల నాగేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

మహానంది: బండిఆత్మకూరు, మహానంది మండలాల్లోని అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలతో ఆదివారం ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు బారెడ్డి శ్రీనివాసరెడ్డి, కొమ్మా మహేశ్వరరెడ్డి శనివారం తెలిపారు. నంద్యాల పట్టణంలోని పద్మావతినగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఉదయం పది గంటలకు సమావేశం ఉంటుందని తెలిపారు. అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వని కేంద్ర బడ్జెట్

ఆత్మకూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో రైతులకు పెద్దపీట వేయలేదని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, సీపీఎం నాయకులు రాజశేఖర్, మాబాషా అన్నారు. పట్టణంలోని కొత్తబస్టాండ్ ఎదురుగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతులను శనివారం దహనం చేశారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతుల గురించి స్పష్టమైన హామీలు ఇవ్వకపోగా యూరియా, ఇతర వాటిపై సబ్సిడీ కోత విధించడం సరికాదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఏసురత్నం, రవీంద్ర, కిరణ్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి 'పల్లెకు పోదాం'

వెలుగోడు: మండలంలో ఈ నెల 9వ తేదీ నుంచి పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీజేపీ నంద్యాల జిల్లా కో - కన్వీనర్ నటేష్గారు తెలిపారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో పల్లెకు పోదాం కార్యక్రమంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో, ప్రతి పట్టణం లో జరగ బోవు కార్యక్రమంపై పార్టీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెలుగోడు ప్రోగ్రాం కన్వీనర్ ప్రతాప్ ఆచారి, కో-కన్వీనర్ లబ్బి మధు, బీజేపీ పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.